

కథా కౌముది

# మనసున మనస్సై

యలవర్తి అనురాధ

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**మంచు** మేలిముసుగులో పెళ్ళి కూతురిలా ఉంది ఊరంతా. పైన మఫ్లర్ కట్టుకుని, చలికోటు వేసుకుని ఆ మంచు తెరను చీల్చుకుంటూ నడకను సాగిస్తున్నాడు కృపాకర్. ప్రశాంతమైన వాతావరణంలో ఆలోచనలు తోడుగా ఆ పయనం తనకెంతో ఇష్టం.

తెల్లవారితే ఏముంది? అంతా గజిబిజి గందరగోళం. అందుకే ఎంత బద్ధకంగా ఉన్నా ఈ మార్నింగ్ వాక్‌ను మాత్రం వదులుకోడు. రోజంతటిలో అతడు ఎంతో ఆనందించే సమయం ఇది.

అందరికీ నడుస్తున్న అతడు ఒక్కడే కనిపిస్తూ ఉంటాడు. కానీ ప్రతీ అడుగు వెంట అడుగు వేస్తూ ప్రక్కన ప్రియ ఉంటుంది. అది అతడి మనసుకు మాత్రమే తెలిసిన సత్యం.

"ప్రియా! ఏదయినా మాట్లాడు"

"ఏం మాట్లాడను? ఈ రోజు ఎందుకో నీ ప్రక్కన మౌనంగా అడుగులు కదపాలని మనసు చెబుతోంది"

"పోనీ అలాగే కానీ నీ మౌనం కూడా నాకెన్నో కబుర్లు చెబుతుంది" అన్నాడు కృపాకర్.

"ఎక్కడా లొంగవు కదా!"

"నువ్వంటే నాకు పిచ్చిప్రేమ. ఆ ప్రేమకోసం నేను ఏమైనా చేస్తాను. నన్ను నేను త్యాగం చేసుకోవలసి వచ్చినా నేను సిద్ధమే"

"ఇప్పుడు నువ్వు చేస్తున్నది అదేగా"

"లేదు ప్రియా. నువ్వలా అంటే నేనొప్పుకోను"

"ఎన్నాళ్ళిలా ఒంటరి ప్రయాణం చేస్తావ్?"

"అరె! చెబితే అర్థం చేసుకోవే, భౌతికంగా నువ్వు నా ప్రక్కన లేవు. కానీ ఆలోచనలలో ఉన్నావుగా అది చాలు. అదే నాకు కొండంత ధైర్యాన్నిస్తుంది. మరొకరిని పెళ్ళి చేసుకుంటే ఈ ఆనందాన్ని కోల్పోతాను. అలాంటి పని ఎప్పటికీ చేయను"

"గత ముప్పై సంవత్సరాలుగా నీకు చెప్పి చెప్పి విసిగిపోయాను. నేను వెళ్ళిపోతేగానీ నువ్వు ఇందులోంచి బయటపడవు"

"వెళ్ళలేవు. నేను వెళ్ళనివ్వను. మనసు సంకెళ్ళతో నిన్నెప్పుడో బంధించేసాను."

"అవును. అది నిజమే అందుకే ఆత్మవై కూడా నీ చుట్టే తిరుగుతున్నాను"

"విధి చేసే వింత నాటకంలో విడిపోయిన జంటగా అయితే మిగిలాంగానీ మనసు గూటిలో ఎప్పుడూ గువ్వల్లా జంటగానే. ఈ బంధాన్నీ, అనుబంధాన్నీ ఎవరూ విడదియ్యలేరు"

"కృపా! కృపా!" ప్రియ పిలుపు అతనికి వీనుల విందుగా వినిపిస్తోంది. ఎలా వెళ్ళాడో అలాగే తిరుగు ప్రయాణమయ్యాడు.

"పెద్దన్నయ్యా"

తమ్ముడు చక్రధర్ పిలుపుకు "ఏంటిరా?" అంటూ వెనక్కి తిరిగాడు.

"కాలేజీలో ఫీజు కట్టాలి అన్నయ్యా!"

"నీకు కాలేజీ ఫీజు కట్టి నాలుగురోజులయింది. బుద్ధిగా చదువుకో వెళ్ళి."

"అవునా?" అయినా అన్నయ్యకు అన్నీ తెలుసు. తెలియదనుకోవటం తనదే తప్పు. అనుకున్నాడు మనసులో చక్రధర్.

చిట్టచివరి తమ్ముడు. వాడంటే అందరికీ ముద్దే. డాక్టరు చదువుతున్నాడు. తమ ఊరు సిరిపురానికి, ప్రజలకు ఆరోగ్యవిషయంలో సేవ చేయాలని ఉబలాటపడుతున్నాడు. వాడి చదువు అయిపోయేటప్పటికి చిన్న డిస్పెన్సరీ తను తెరిపించాలి.

రెండో తమ్ముడు హేమంత్. వాడికి చదువు చెప్పటమంటే ఎంతో ఇష్టం పాఠాలతోపాటు విద్యార్థులకు విలువలను కూడా బోధిస్తూ సమాజానికి ఎంతో ఉపకారం చేస్తున్నాడు.

ఇప్పటి వాళ్ళు అవే కదా కోల్పోతున్నారు.

ఇక నాలుగోవాడు సంఘసేవకే పుట్టానన్నట్లుంటాడు. వాడి ప్రతి పనిలో ఎవరికో ఒకరికి పనికి వచ్చే పని ఉంటుంది.

ఊరు మన తల్లిలాంటిది. బిడ్డలా సేవ చేస్తూ రుణం తీర్చుకుంటూ ఉండాలి. అని తండ్రి చెప్పిన మాటలని నిజం చెయ్యాలని తామంతా తపిస్తూ ఉంటారు. తండ్రిని తలుచుకోగానే కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఏయ్! ఆ కళ్ళు నావి. అందులో కన్నీళ్ళని నేను చూడలేను" ప్రియ ప్రక్కనుంచీ అంటున్న మాటలకు కండువాతో అద్ది ఆపేసాడు.

"కృపా! పొలంకి వెళ్ళలేదా?" అమ్మ లోకేశ్వరి పిలుపులో ఈ లోకంలోకి వస్తూ "ఇప్పుడే వెళుతున్నానమ్మా" అన్నాడు.

"ఆ! నాన్నా! అలాగే సీతయ్యకి నాలుగు చీవాట్లు పెట్టు. భార్య మాటలు విని వాళ్ళమ్మను వృద్ధాశ్రమంలో పెడతాను అంటున్నాడట. అలాంటివి మన ఊరిలో జరగటానికి వీలులేదు. తను పస్తులు ఉండి వాడ్ని పెంచింది. అది వాడికి తెలియక పోవచ్చు. కానీ మనకు తెలుసుకదా!"

"అలాగే అమ్మా!"

"అందరూ కలిసి ఊర్లో మద్యం షాపే లేకుండా చేసాం. అలాంటిది ఇది ఒక లెక్కా?" అనుకున్నాడు మనసులో.

"అవును. నువ్వు ఏదనుకున్నా సాధిస్తావు. నాకు తెలుసుకదా" చెవిలో ప్రియ గుసగుసలు.

నవ్వుకున్నాడు కృపా.

ఇది తమకు అలవాటేనన్నట్లు ఎదురు పడ్డ జనాలు పట్టించుకోవటం ఎప్పుడో మానేసారు. అతను ప్రేమలోకంలో ఉన్నా ఈలోకానికి కావల్సినవి చేస్తూనే ఉన్నాడు. తన గ్రామానికి స్వచ్ఛగ్రామంగా పేరు వచ్చిందంటే అది అతని వల్లే మరి.

ఇలా అనుక్షణం తనని నీడలా వెంబడించే ప్రియలేదని అందరూ అంటుంటే తనకు ఎంతగానో ఉంటుంది.

మనసున మనసై తోడొకరుండిన అదే భాగ్యమూ.. పాట వినిపిస్తోంది ఎవరింట్లోంచో టీ.వీలో వస్తోందేమో!

ఎంత చక్కటి భావం? రాసిన వాళ్ళకి, పాడిన వాళ్ళకు చేతులెత్తి మొక్కాల్సిందే

"కృపాబాబూ! గంగి గుడిసె అంటుకుపోయింది బాబూ" అంటూ ఎదురుగా చిన్ని కృష్ణ వచ్చి చెప్పటంతో

"అరెరె" అంటూ అటు పరుగెత్తాడు. అందరూ కలసి మంటలు ఆర్పారు కానీ ఏమీ మిగలలేదు. ప్రక్క ఇళ్ళకు మంటలు వ్యాపించకుండా మాత్రం ఆపగలిగారు.

గంగి నడిరోడ్డులో నిలబడింది.

"గంగీ! నువ్వు మా ఇంటికి వెళ్ళు. ఏం భయంలేదు. అమ్మ నిన్ను చూసుకుంటుంది. మా ఇంట్లోనే ఉండవచ్చు. నలుగురూ నాలుగు చేతులు వేస్తే నీకు గుడిసె ఎంతసేపటిలో రాదూ. అరేయ్ చిన్నీ! నేను తొందరపని మీద పొలంలోకి వెళుతున్నా. అక్కను మా ఇంటి దగ్గరకు వెంటబెట్టుకుని తీసుకు వెళ్ళి అమ్మకు అప్పచెప్పు"

"అలాగే" అని తల ఊపి గంగి చెయ్యి పట్టుకున్నాడు రమ్మన్నట్లు.

అతన్ని అనుసరించింది గంగి.

పొలం పని చూసుకుని మామిడిచెట్టు నీడన సేదతీరసాగాడు. చెట్టంతా పూతతో కళకళలాడుతోంది. మామిడికాయలు చెట్టెక్కి కోసుకుని దిగమంటే ప్రియకు ఎంతో ఇష్టం. ఎందుకురా ప్రియ అంటే నీకంత ఇష్టం అని అందరూ అడుగుతూ ఉంటారు. ఇష్టానికే ఇష్టం ఏమిటని అడిగితే తన ప్రియనే చూపుతుంది. అలాంటిది తను ఎంత?

తన భావనకి తనే నవ్వుకున్నాడు.

ప్రియ తన అత్తకూతురు. చిన్నప్పటి నుంచీ కలిసే పెరిగారు. ఇద్దరి ఇళ్ళు ప్రక్కప్రక్కనే ఉన్నా ఇద్దరూ ఎప్పుడూ ఒక్కచోటే ఉండేవారు. ఒకే స్కూల్లో చదివారు. అక్కడ కూడా ప్రక్కప్రక్కనే ఉండేట్లు కూర్చునేవారు అటూ ఇటూ. అది చూసి అందరూ నవ్వేవారు. మెచ్చుకునేవారు కూడా. వాళ్ళ వయసుతో పాటూ ప్రేమ కూడా పెరుగుతూ వచ్చింది. పెళ్ళిలో ముడిపెట్టేస్తే సరి అనుకున్నారు పెద్దలు.

ఆ ఇంట బాజాభజంత్రీలు మ్రోగాయి.

సంవత్సరం పాటు రోజులు ఎలా గడిచిపోయాయో వారికే తెలియదు. ప్రియ గర్భం దాల్చింది. తన ప్రతిరూపాన్ని అందివ్వబోతున్న ప్రియను మరింత అపురూపంగా చూసుకోసాగాడు.

కానీ అన్ని వేళలా కాలం ఒకలా ఉండదన్నట్లు కాన్పులో తల్లి, పిల్లా ఇద్దరూ మృతి చెందారు.

ప్రియ యముడ్ని ఎదురించి అయినా తనను విడిచి వెళ్ళదనుకునేవాడతను.

"ఇప్పుడు మాత్రం ఎక్కడికి వెళ్ళాను. నీ ప్రక్కనే ఉన్నానుగా" చెవిలో గుసగుసగా వినిపించేవి మాటలు.

ఇదే తన అదృష్టం అనుకున్నాడు మనసులో.

అప్పటినుంచీ ఇలా గడిపేస్తున్నాడు. కుటుంబసభ్యుల ఆనందం తన ఆనందాన్ని వెతుక్కుంటున్నాడు.

పెళ్ళాంపోగానే మరో పెళ్ళికి సిద్ధమైపోయే ఈకాలంలో ఇలాంటి వాళ్ళు అరుదే

అవును. మహాత్ముడు, మదర్ థెరిసాలు వందమంది ఉండరు. ఒక్కరే ఉంటారు.

అలాగే ప్రేమకి ఈ కృపాకర్ కూడా.

కృపాకర్‌ని లేపటానికి వచ్చిన లోకేశ్వరికి "ప్రియా! తెల్లవారింది. ఇక లేద్దామా?" అన్న కొడుకు మాటలతో కడుపు తరుక్కుపోయింది.

"శ్రీరామచంద్రుడిలాంటి కొడుకు. సీతమ్మను దూరం చేసినట్లు మా ప్రియను లాక్కెళ్ళావు. ఇంకా ఇలా ఎన్నాళ్ళు అలా ఆమె జ్ఞాపకాలలో బ్రతుకుతాడు? ఒడ్డున పడెయ్యి తండ్రీ" అక్కడే ఉన్న ఆంజనేయ స్వామి ఫోటోకు నమస్కరించింది.

ఎవరైనా మనస్తత్వశాస్త్రకి చూపిద్దామని ఎంతో ప్రయత్నించారు. రానంటే రానని మొరాయించాడు. నా నుంచీ ప్రియని దూరం చేస్తే నేనే మీ అందరికీ దూరమయిపోతానని బెదిరించటంతో తామంతా ఏమీ చేయలేని పరిస్థితులలోకి నెట్టి వేయబడ్డారు.

అది ఒక్కటే లోపం తప్ప మరే విషయంలోనూ కృపాకర్‌ని తప్పు పట్టడానికి ఉండదు. అందుకే ఆ విషయంలో ఊరంతా సహకరిస్తోంది.

ఒకరోజు తోచక 'శతమానంభవతి' సినిమాకు వెళ్ళాడు. సినిమా చాలా హాయిగా ఉంది కదా బావా అంది ప్రియ ప్రక్కన చేరి.

"అవును ప్రియా!" అన్న పదాలు మనసులోనే ఉండిపోయాయి. బయటకు రాలేదు.

సినిమా నుంచీ బయటకు వస్తుంటే "పెద్దన్నా! మా అమ్మాయికి ఆడపిల్ల పుట్టింది. ఒక్కసారి చూసి ఆశీర్వదించి పోతే బాగుంటాది" అంది పార్వతమ్మ.

"రేపు తప్పకుండా వెళ్ళాలి" అనుకున్నాడు మనసులో.

"అవును వెళదాం" అంది ప్రియ ప్రక్కనుంచే

"తప్పకుండా వస్తాను" అని ఆమెకు మాటిచ్చి ముందుకు కదిలాడు.

అతని వెంటే ప్రియకూడా.

"కాస్త నెమ్మదిగా నడువు బావా. అంత తొందర తొందరగా ఎవరో వెంటపడి తరుముతున్నట్లు పరుగెడతావేం?"

"అది తను అసలు ఆలోచించలేదు" అనుకుంటూ తన నడక వేగం తగ్గించాడు కృపాకర్.

అందరూ లేదనే మనిషికి కూడా అంత విలువ ఇస్తాడు. ఆత్మకి వేగం లేకపోవటమేమిటి అని కూడా ఆలోచించడు.

కనకబాబు ఎదురు వచ్చాడు.

"అన్నా! నీతో మాట్లాడాలి"

"పద! అలా రచ్చబండ దగ్గర కూర్చుని మాట్లాడుకుందాం"

"లేదన్నా! మా ఇంటికి వెళదాం"

"సరే!" అన్నాడు.

లోపల వరండా అరుగు మీద కూర్చున్నారు ఇద్దరూ.

"నా భార్య భాగ్యం యాక్సిడెంట్‌లో పోయిందని నీకు తెలుసుకదా. నాకు వేరే పెళ్ళి చేసుకోవాలని ఉంది. "

"చేసుకో. అందుకు ఆలోచించటం ఎందుకు?"

"నీలా ఉండలేకపోతున్నానన్నా"

"పిచ్చి రాజా! నాలా అందరూ ఉంటే ఇంక సంసారాలు ఎక్కడ ఉంటాయి? చచ్చిపోయిన వాళ్ళతో మనమూ పోతామా? అలాగని జీవితమంతా ఒంటరిగా గడపగలమా?"

"మరి నువ్వెందుకు అలా ఉన్నావన్నా?"

అమ్మగానీ ఇతనితో ఇలా అడిగించటంలేదు కదా? అని అనిపించింది ఒక్క క్షణం కృపాకర్‌కి. కాదు. కాదు. ఎప్పుడూ అలా చెయ్యదు అమ్మ అనుకున్నాడు మళ్ళీ.

"అందరిదీ ఒక భావన కాదు కదా! ప్రియతో నా బంధం అలా ముడిపడిపోయింది. ఆమె స్థానంలో నేను మరొకరిని ఊహల్లో కూడా భరించలేను. అందుకే ఆ ఆలోచనను ప్రక్కకు పెట్టాను. నాకు ఇలా ఒంటరిగా ఉండటంలోనే సంతోషం ఉంది. అయినా ప్రియలేకపోయినా మా వాళ్ళంతా ఉన్నారుగా. నీకు అలాకాదు. తోడు ఎవ్వరూ లేరు. సమాజంలో ఒంటరిగా బ్రతకటం కష్టం. నేనే మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేస్తాలే"

"ఇలా అడిగానని ఏం అనుకోవుగా?"

"భలేవాడివే. అన్నా అని పిలిచాక తమ్ముడిని తప్పుపడతానా?"

"సరే. నేను వెళ్ళొస్తా"

"కాస్త మజ్జిగ త్రాగి వెళ్ళన్నా"

"లేదు. అమ్మ నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. వెళ్తున్నా" అంటూ వెళ్ళిపోయాడు కృపాకర్.

అందరికీ చచ్చిపోయిన ప్రియ తనతో అనుక్షణం ఉంటుందని చెప్పినా జనం నమ్మరు. వాళ్ళతో నాకు పని ఏంటి?

"అవునవును బావా" అంది ప్రియ చిలిపిగా.

అలాంటప్పుడే ప్రియ తలమీద సరదాగా ఒకటి వెయ్యాలనిపిస్తుంది దెబ్బతగలకుండా.

కానీ అంది మాత్రం అసాధ్యం కదా!

"తొందరగా నన్నుకూడా అక్కడికి తీసుకెళ్ళిపో ప్రియా" ఘోషిస్తోంది అతని హృదయం.

"వచ్చేద్దువుగానీ బావా! వచ్చేద్దువుగానీ"

ప్రియ కంఠం లాలనగా.

ఆ రోజు కోసం ప్రతిరోజూ కళ్ళు తెరుస్తున్నాను ప్రియా.

"నాకు తెలియదా బావా?"

ఇంటికి ఎలా వచ్చాడో అతనికే తెలియదు.

తల్లి లోకేశ్వరి అతనికి ఎదురువచ్చి "వచ్చావా? ఇంకా రాలేదేమిటా అని అనుకుంటున్నా. రా! భోజనం పెట్టేస్తాను"

అన్నం తింటున్న కొడుకుతో "కృపా! ఈలోకం రోజు రోజుకీ మారిపోతోందిరా"

"ఏమైందమ్మా?"

"మన ఎదురింటి సౌభాగ్యం ఉంది కదరా"

"ఆఁ ఉంది"

"వాళ్ళాయన ఎవరితోనో ఉంటున్నాడట. ఊరంతా గుప్పుమంటోంది. మన ఊర్లో ఇలాంటి తప్పుడు పనిని మనం చెయ్యనివ్వంగా. ఒక పెళ్ళాం ఉండగా మరో పిల్లని ఆ భావంతో చూడటం తప్పుకదా! నిజానిజాలు ఏమిటో నువ్వే నిగ్గు తేల్చాలి"

"చెప్పావుగా నేను కనుక్కుంటాలే"

ఈ మధ్య తనూ ఒకటి రెండు చోట్ల ఈ మాటలు విన్నాడు.

అతను అలాంటి వాడు కాదు. ఇందులో ఏదో రహస్యం ఉంది. తప్పకుండా ఓసారి ఆ విషయం తెలుసుకోవాలి.

సౌభాగ్యం నుదిటిన ఆ కుంకుమకే అందం వచ్చినట్లుంటుంది. అలాంటి ఆమెకు ఇలాంటి కష్టం రావటమంటే తను ఒప్పుకోను కాక ఒప్పుకోడు.

మనిషి నైతిక విలువలు పాటించకపోతే ఎలా?

"పోనీలేమ్మా ఇప్పుడేం లేదు కదా!"

"ఏమో ఉండి ఉంటే అన్న విషయాన్నే భరించలేకపోయాను"

"ఇప్పుడు తెలిసిపోయిందిగా. హాయిగా నిద్రపో"

"ఆ మాట తెలిసినప్పటినుంచీ నాకు కంటిమీద కునుకు లేదంటే నమ్ము. అలాటి ఆడకూతురికి కష్టం వచ్చిందంటే నాకు వచ్చినట్లు కాదా?" అంటూనే ఆవిడ గదిలోకి వెళ్ళిపోయింది.

"బావా! నాకు మాత్రం ఆ బాధలేదు" ప్రియ అంది నవ్వుతూ. చిన్నగా నవ్వుకున్నాడు.

మళ్ళీ అదే ఆలోచన. చిన్నగా ప్రియ తలమీద తట్టాలని.

ఎప్పుడు తామిద్దరూ కలిసేది. అందరూ చచ్చిపోతామేమో అని మృత్యువుకి భయపడతారు. తను మాత్రం దాన్ని ఆహ్వానిస్తున్నాడు ప్రియను చేరాలని.

"వద్దు బావా! నా ఒక్కదానికోసం నువ్వలా ఎదురు చూడకు. నీ వల్లే కదా మన ఊరు ఇంత బాగుపడింది. ఇంకా నువ్విక్కడే ఉండి మంచి మంచి పనులు చేస్తుంటే నేను ఆనందంగా చూస్తుంటాను. ఇప్పుడు మాత్రం ఏమయింది? ఎప్పుడూ నేను నీ ప్రక్కనే ఉంటున్నానుగా. అలాంటి ఆలోచనలు రానివ్వనని నాకు మాట ఇవ్వు."

"ఇంకా తటపటాయిస్తావేం బావా? నీ వల్లే ఈ ఊరు 'విలువల ఒడి'లా మారిందని మన ఊరివారందరికీ తెలుసు. అలాంటిది నువ్వు లేకపోతే ఎలా మారిపోతుందో ఏమో?"

"చెడ్డవాడు మంచిగా మారాలంటే కష్టం ప్రియా. అలా మారిన మంచివాడు తొందరగా చెడ్డవాడు అవడు. ఆ నమ్మకం నాకుంది. నన్ను నీ దగ్గరికి వచ్చెయ్యనీ ప్రియా"

"బా....వా..!"

"ప్రి...యా..!"

వాళ్ళ పిలుపులు ప్రక్కప్రక్కనే.

కొంతకాలానికి తనువులూ ప్రక్కప్రక్కనే.

కాలం ఇచ్చిన తీర్పు ఇదే.

Click here to share your comments on this story